సాక్షి
నంద్యాల
శుక్రవారం । 5 । మే । 2023



శ్రీమఠంలో హైకోర్టు జడ్జి

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు ఏపీ హైకోర్టు జడ్జి శ్యామ్ సుందర్ మంత్రాలయం చేరుకున్నారు. ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ స్వాగతం పలికారు.



ఘనంగా మాచదేవ జయంతి

కౌతాళం: మడివాళ్ల మాచదేవ జయంతి వేడుకలు గురువారం కౌతాళంలో ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో వీరభద్ర స్వామి వేషధారి అలరించారు.



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా గురువారం చిక్‌బళ్లాపూర్ కర్ణాటకు చెందిన నర్తనా డ్యాన్స్ అకాడమి కళాకారుల సంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది.

న్యూస్‌రీల్

నవరత్నాల సంక్షేమ క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ, అధికారులు

నంద్యాల: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సంక్షేమ క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆవిష్కరించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో నవరత్నాల సంక్షేమ క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి, డీఎల్‌పీఓ జనార్దన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ రూపొందించిన 2023–24 ఆర్థిక సంవత్సర సంక్షేమ క్యాలెండర్‌ను ప్రభుత్వ కార్యాలయాలు, శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్లమెంటు సభ్యులు ఇతర ప్రజాప్రతినిధులకు పంపిణీ చేయాలని అధికారులను సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏడాది పొడవునా ఏ నెలలో ఏ సంక్షేమ పథకాల లబ్ధి అందిస్తున్నామన్నది సంక్షేమ క్యాలెండర్ ద్వారా ముందుగానే ప్రకటించి తదనుగుణంగా ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తుందన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షాలు

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలోని పలు మండాలల్లో బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు ఓ మోస్తరు వర్షం కురిసినట్లు అసిస్టెంట్ డీఆర్‌ఓ కామేశ్వరరావు గురువారం తెలిపారు. శ్రీశైలంలో అత్యధికంగా 38.4మి.మీ, కోవెలకుంట్ల మండలంలో అత్యల్పంగా 1.0 మి.మీ వర్షం కురిసిందన్నారు. అదేవిధంగా నందికొట్కూరులో 32.8, జూపాడుబంగ్లా, మిడుతూరు మండలాల్లో 21.6, పగిడ్యాలలో 12.4, కొత్తపల్లి 2.4మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సగటున 4.5 మి.మీ వర్షపాతం నమోదు అయ్యిందన్నారు.

నేడు కూడా పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పింఛన్ల పంపిణీ 99 శాతం పూర్తయింది. బయోమెట్రిక్ (వేలిముద్రలు పడని వారికి, ఐరిష్(కళ్ళు) నమోదు కాని వారికి ప్రస్తుతం ఆర్‌బీఐఎస్ ద్వారా ముఖ గుర్తింపు(ఫేస్ ఐడెంటిఫికేషన్) ద్వారా పింఛన్ల పంపిణీ జరుగుతుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం కూడా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. కర్నూలు జిల్లాలో 2,38,165 పింఛన్లు ఉండగా 4వ తేదీ సాయంత్రం 6 గంటల సమయానికి 2,34,190 పింఛన్లు పంపిణీ చేశారు. కర్నూలు జిల్లాలో 98.33 శాతం పంపిణీ జరిగింది. నంద్యాల జిల్లాలో 2,15,670 పింఛన్లు ఉండగా, 98.37 శాతంతో 2,12,450 పింఛన్ల పంపిణీ పూర్తయింది.

నావికా దళంలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): భారత నావికాదళంలో 242 షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ పోస్టులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమాధికారి పీవీ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్‌లో 150, టెక్నికల్ బ్రాంచ్‌లో 80, ఎడ్యుకేషన్ బ్రాంచ్‌లో 12 పోస్టులు భర్తీ చేస్తున్నారన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 14వ తేదిలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల వయస్సు, విద్యార్హతలు, ఇతర వివరాలకు https://www.joinindiannavy.gov.inను సందర్శించాలన్నారు.

కారుణ్య అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు



షాట్‌పుట్‌లో సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు(రాజ్‌విహార్): ఆర్టీసీలో కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం కర్నూలులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల మైదానంలో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. వంద మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్‌లో అభ్యర్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. కడప జోన్ పరిధిలోని ఉమ్మడి కర్నూలు, వైఎస్ఆర్ కడప, అనంతపురం జిల్లాలకు 109 మంది హాజరు కాగా ఇందులో 39 మంది కర్నూలు జిల్లాకు చెందిన అభ్యర్థులు ఉన్నారు. జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి టి. వెంకటరామం పర్యవేక్షణలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీరు రజియా సుల్తానా, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజరు రాజా గజలక్ష్మీ, పీఓ చంద్రాయుడు సమక్షంలో ఈ పరీక్షలు నిర్వహించారు.

ఆధార్ సేవ మరింత చేరువ



సిద్ధేశ్వరం చెంచు కాలనీలో ఆధార్ నమోదు చేస్తున్న దృశ్యం(ఫైల్)

ఆధార్ కష్టాలకు రాష్ట్ర ప్రభుత్వం చెక్ పెట్టింది. గ్రామ, వార్డు సచివాయాల్లో ఆధార్ ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి సేవలు మరింత చేరువ చేసింది. ఆధార్ కార్డు పొంది పదేళ్లు పూర్తయిన వారు తగిన గుర్తింపు వివరాలతో అప్‌డేట్ చేయించుకోవాలని యూఐడీఏఐ(యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో బ్యాంకులు, పోస్టాఫీసుల చుట్టూ తిరిగి గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి వచ్చింది. గ్రామీణ ప్రాంత ప్రజలు మండల కేంద్రాలకు వెళ్తున్నారు. ఈ తరుణంలో సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరిస్తూ గ్రామ, వార్డు సచివాయాల్లో ఆధార్ సేవలను అందుబాటులోకి తేవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు
- జిల్లాలో 69 సచివాలయాల్లో అవకాశం
- నామమాత్రపు రుసంతో అప్‌డేట్ సేవలు
- తొలిసారి ఆధార్ నమోదు ఉచితం

నంద్యాల(సిటీ): ఆధార్.. అన్నిటికీ ఈ కార్డు నంబర్ కీలకం.. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ఉపకార వేతనాలు, బ్యాంకుల్లో ఖాతాలు తెరవడం నుంచి చివరకు మొబైల్ ఫోన్ సిమ్‌కార్డు పొందేందుకు ఆధార్ కార్డు తప్పనిసరిగా మారింది. అయితే గతంలో ఈ కార్డు పొందాలన్నా లేక ఏవైనా మార్పు చేర్పులు చేయాలన్నా పెద్ద ప్రహసనంగా ఉండేది. కాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి ఎన్నో సేవలను ప్రజలకు దరి చేర్చగా.. కొత్తగా ఆధార్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చింది. గతంలో మాదిరి ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన అవసరం లేకుండా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే ఆధార్ సేవలు పొందేలా చర్యలు తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా మొదట 69 సచివాలయాలకు ఆధార్ సేవలను అనుసంధానం చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్‌లుగా విధులు నిర్వర్తిస్తున్న వారికి అధికారులు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. జిల్లాలో 516 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా మొదట 69 సచివాలయాలను ఎంపిక చేసి ల్యాప్‌టాప్, ప్రింటర్, స్కానర్, ఐరిస్, వేలిముద్రల నమోదు పరికరాల కిట్లను అందజేశారు. ఆధార్ సేవలను అందించేందుకు ప్రభుత్వం డిజిటల్ అసిస్టెంట్‌లు, ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి ఆధార్ నమోదు ప్రక్రియను చేపట్టేలా చర్యలు ఉపక్రమించారు. మొదటి సారి ఆధార్ నమోదుకు ఉచితంగా అవకాశం కల్పించారు. అప్‌డేట్, వివరాల మార్పులు చేర్పులకు నామమాత్రపు రుసం వసూలు చేస్తున్నారు. మొదటిసారి బయోమెట్రిక్ అప్‌డేట్, డెమోగ్రాఫిక్ అప్‌డేట్ ఉచితం కాగా, బయోమెట్రిక్ అప్‌డేషన్‌కు రూ. 100, డెమోగ్రాఫిక్ అప్‌డేషన్‌కు రూ. 50, డౌన్‌లోడ్, కలర్ ప్రింట్‌నకు రూ. 30, డాక్యుమెంట్ల అప్‌డేషన్‌కు రూ. 50 ఫీజు నిర్ణయించారు. గ్రామ సచివాలయాలలో ఆధార్ మార్పుల చేర్పుల కోసం ఏదైనా ఒరిజినల్ ఓటర్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంది.



లలితానగర్‌లో చిన్నారికి ఆధార్ నమోదు చేస్తున్న దృశ్యం

జిల్లాకు అదనంగా 34 ఆధార్ కిట్లు

నంద్యాల జిల్లాలో అధికంగా ఆధార్‌ను అప్‌డేట్ చేసుకునేందుకు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ చర్యలకు ఉపక్రమించారు. ముఖ్యంగా 0–5 సంవత్సరాల వయస్సు ఉన్న చిన్నారులకు ఆధార్ లేనందున వారికి ప్రత్యేక సెంటర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు జిల్లాలో 69 ఆధార్ కిట్లు ఉండగా మరో 34 కిట్లను సచివాలయాలకు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ కిట్లు మరో 20 రోజులలోగా టెక్నికల్ టీంలు అందుబాటులోకి తీసుకురానున్నారు. అదేవిధంగా ప్రతి నెల మొబైల్ ఆధార్ కేంద్రాలను నెలకొల్పి ప్రజలకు ఆధార్ సేవలను మరింత చేరువ చేయనున్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ శిబిరాలు

మహానంది మండలంలో ఈ నెల 5వ తేదీన తమ్మడపల్లె, 6వ తేదీన యూ.బొల్లవరం, 8వ తేదీన మహానందిలో, 9న గోపవరం, ఆర్ఎస్ గాజులపల్లె, 10వ తేదీన సీతారామపురం, 11న మసీదుపురం, 12, 15, 16వ తేదీల్లో గాజులపల్లెలో మొబైల్ ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయి.

➡ పాణ్యం మండలంలో 5న తమ్మరాజుపల్లె, గోనవరం, 6వ తేదీన కందికాయపల్లె గ్రామానికి చెందిన ప్రజలు తమ్మరాజుపల్లె సచివాలయంలో, ఆలమూరు ప్రజలకు ఆలమూరు సచివాలయంలో, 8వ తేదీన బలపనూరు, కొణిదేడు, 9వ తేదీన పిన్నాపురం ఎంపీయూపీ పాఠశాలలో, నెరవాడ సచివాలయంలో మొబైల్ ఆధార్ శిబిరం నిర్వహించనున్నారు.

➡ మిడ్తూరు మండలంలో 5న చెరకుచెర్ల, 6న జలకనూరు, 8వ తేదీన నాగలూటి, 9న సుంకేసుల, వీపనగండ్ల, 10,11న కడుమూరు, 12,15వ తేదీల్లో దేవనూరు సచివాలయాల్లో మొబైల్ ఆధార్ సేవలు ఉంటాయి.

➡ అవుకు మండలంలోని సుంకేసులలో 5వ తేదీన, 6న చెర్లోపల్లి, 9,10వ తేదీల్లో ఉప్పలపాడు, 11,12న కొండనాయినిపల్లె, 15న గుండ్లశింగవరం, 16న అన్నవరం, 17న మన్నేనాయక్ (ఎంఎన్) తండాలలో స్పెషల్ ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నారు.

➡ నంద్యాల పట్టణంలో ఈనె నెల 5న తెలుగుపేట, ఏకలవ్యనగర్, మూలసాగరం సచివాలయాల్లో, 8 నుంచి 10వ తేదీ వరకు వైఎస్సార్ నగర్, సాయిబాబానగర్, వీసీ కాలనీలో, 11 నుంచి 12వ తేదీ వరకు రోజాకుంట, విశ్వనగర్, విజయపురికాలనీలో మొబైల్ ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు తెలిపారు.

జిల్లా పునర్విభజనతో ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి



ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి నంద్యాల జిల్లా వేరు కావడంతో ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకోవాలి. ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆధార్ తప్పనిసరిగా ఉన్నందున ఆధార్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలి. ప్రస్తుతం సచివాలయాలలో ఆధార్ సేవలు సులభంగా అందుతున్నాయి.

– రవిచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్, నంద్యాల

నామమాత్రపు రుసుం



సచివాలయాల ద్వారా ఆధార్ సేవలను నామ మాత్రపు రుసుంతో అందిస్తున్నాం. ప్రభుత్వ సూచన మేరకు ప్రజలు ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించుకుంటున్నారు. ఈ కార్యక్రమం ద్వారా సులువుగా ఆధార్ సేవలు అందరికీ అందుతున్నాయి. ప్రజలు నేరుగా సచివాలయానికి చేరుకుని తమ పని త్వరితిగతిన పూర్తి చేసుకుంటున్నారు.

– వి.సుధీర్, ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, ఏకలవ్యనగర్, నంద్యాల

సమయం ఆదా అవుతుంది



గతంలో ఆధార్ కార్డు అప్‌డేట్‌కు బ్యాంకు, పోస్టాఫీసు, ఆధార్ నమోదు కేంద్రాల్లో సమయం ఎక్కువగా వృథా అయ్యేది. ఇప్పుడు మా వార్డు సచివాలయంలోనే ఆధార్ నమోదు కేంద్రాన్ని నెలకొల్పడంతో చాలా మందికి ఉపయోగకరంగా మారింది. ఆధార్ కార్డుల సవరణ, నమోదు తదితర ప్రక్రియ అంతా చాలా సులువుగా జరిగిపోతుంది.

– రమేష్‌నాయుడు, దేవనగర్, నంద్యాల

చక్రధారికి కోనేటి వైభవం



ఎగువ అహోబిలంలో స్వామికి చక్రస్నానం చేయిస్తున్న దృశ్యం



దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: అహోబిలేశుని జయంతి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ఎగువ అహోబిలంలో ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా తీర్థవారి చక్రస్నానం నిర్వహించారు. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జ్వాలనరసింహ స్వామిని భవనాసి గుండం వద్దకు చేర్చారు. అక్కడ వేద పండితులు, అర్చకులు.. సుదర్శనమూర్తి, నిత్య అభిషేకమూర్తులకు పంచామృతాభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం సుదర్శనమూర్తికి, నిత్య అభిషేక ఉత్సవ మూర్తికి కోనేరులో శాస్త్రోక్తంగా తీర్థవారి చక్రస్నానం చేయించారు. ఉత్సవమూర్తులతో పాటు, అర్చకులు, వేదపండితులు, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు శాస్త్రోక్తంగా తీర్థవారి చక్ర స్నానాలు అచరించారు. దిగువ అహోబిలంలో కలశ తిరుమంజనంలో భాగంగా ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములకు కొలువుంచి పంచామృతాభిషేకం నిర్వహించి 108 కలశాలతో తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

ఆర్‌యూలో నిధుల మళ్లింపు నిజమే!

- సీఐడీ విచారణకు పాలకమండలి తీర్మానం
- వర్సిటీలో ఫేక్ సర్టిఫికెట్లతో పనిచేస్తున్న పది మందిపై క్రిమినల్ కేసులు
- అడ్మిషన్స్ డైరెక్టర్‌ను సస్పెండ్ చేస్తూ వర్సిటీ ఈసీ తీర్మానం



రాయలసీమ యూనివర్సిటీ

కర్నూలు(సిటీ): రాయలసీమ యూనివర్సిటీలో నిధుల మళ్లింపు నిజమేనని తేలింది. ఈ ఘటనపై సీఐడీ విచారణకు ఆదేశిస్తూ పాలకమండలి తీర్మానం చేసింది. గురువారం ఆర్‌యూ పాలకమండలి సమావేశం ఆన్‌లైన్‌లో నిర్వహించారు. విజయవాడ నుంచి ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలారావు, ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, ఆర్‌యూ వీసీ ఆచార్య ఆకెపోగు ఆనందరావు, ఇతర ఈసీ సభ్యులు పాల్గొన్నారు. వర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ విభాగంలో చోటు చేసుకున్న నిధుల మళ్లింపుపై, నాన్ టీచింగ్ విభాగంలో ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిపై చర్చించారు. రాయలసీమ యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ విభాగం డైరెక్టర్‌గా ఆచార్య ఎం.ఇ.రాణి సుమారు మూడేళ్లు పనిచేశారు. ఇటీవల ఈ విభాగంలో నిధుల మళ్లింపుపై ప్రచారం జరగడంతో వర్సిటీ వైస్ చాన్సలర్ నలుగురితో కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ చైర్మన్‌గా రిజిస్ట్రార్ సుందరానంద పుచ్చ, సభ్యులుగా ప్రొఫెసర్లు సంజీవరావు, మధుసూదన్ వర్మ, ఎన్‌టీకే నాయక్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్లు ఉన్నారు. వీరు విచారణ జరిపి నిధుల మళ్లింపు వాస్తవమేనని వీసీకి నివేదిక అందజేశారు. ఈ నివేదిక ప్రకారం రూ.72,60,000 నిధులు డైరెక్టర్ తన సొంత ఖాతాలోకి మళ్లించుకున్నట్లు గుర్తించారు. ఇందులో సుమారుగా రూ.8 లక్షలు తిరిగి డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ విభాగానికి జమ అయినట్లు నివేదికలో పొందుపరిచారు. ఈ నివేదికపై పాలకమండలి సమావేశంలో ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సదరు ప్రొఫెసర్‌ను సస్పెండ్ చేయాలని, అదే విధంగా బహిరంగ విచారణకు రిటైర్డ్ ఆడిటర్ కన్నన్‌దాస్, ఉషారాణి (ఎస్వీ యూనివర్సిటీ ఆడిటర్), ఎన్వీ రెడ్డి (కాకినాడ జేఎన్‌టీయూ రిటైర్డ్ డిప్యూటీ రిజిస్ట్రార్) నియమించారు. నిధుల మళ్లింపుపై సీఐడీతో విచారణ చేయించేందుకు సమావేశంలో తీర్మానం చేశారు.

నిబంధనలకు లోబడే నిధుల ఖర్చు

వర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ విభాగంలో నిబంధనలకు లోబడే నిధులు ఖర్చు చేశామని ప్రొఫెసర్ ఎం.ఇ.రాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020–21, 2021–22, 2022–23 విద్యా సంవత్సరంలో ఖర్చు అయిన లావాదేవీలు తీసివేయకుండానే విచారణ కమిటీ రూ.64 లక్షలు నిధులు దుర్వినియోగం అయినట్లు తనపై నివేదిక ఇవ్వడం దుర్మార్గమని పేర్కొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్నవారిపై క్రిమినల్ కేసులు

విద్యాశాఖ అధికారులు విచారణ చేసి ఇచ్చిన నివేదిక ప్రకారం నకిలీ సర్టిఫికెట్లతో నాన్ టీచింగ్ ఉద్యోగాల్లో చేరిన పది మందిపై మొదటగా క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు ఈసీ తీర్మానం చేసింది. కేసుల నమోదు అనంతరం ఆ ఉద్యోగులను తొలగించి ఇన్నేళ్లుగా వారు పొందిన వేతనాలను సైతం రికవరీ చేసే అవకాశముంది.

జిల్లా వాసుల కల నెరవేరింది

- మెడికల్ కళాశాల ఏర్పాటుతో పేదలకు మెరుగైన వైద్యం
- అభివృద్ధిని ఓర్వలేకనే ప్రతిపక్షాల విమర్శలు
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



నంద్యాల మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను తెలుసుకుంటున్న మంత్రులు విడదల రజని, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా, ఎమ్మెల్సీ ఇసాక్ తదితరులు

బొమ్మలసత్రం: నూతన జిల్లాగా ఆవిర్భవించిన నంద్యాలలో రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడంతో జిల్లా వాసుల చిరకాల కల నెరవేరిందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను మంత్రులు రజిని, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి పరిశీలించారు. అలాగే సర్వజన ఆసుపత్రిలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం మంత్రి రజిని మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలు మంజూరు కాగా ఈ ఏడాది ఐదింటిని ప్రారంభించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.475 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. కళాశాల నిర్మాణం పూర్తి దశకు చేరుకుందని, ఈ ఏడాది 150 ఎంబీబీఎస్ సీట్లు భర్తీ చేయనున్నామని వివరించారు. ఐదు మెడికల్ కళాశాలలు పూర్తి దశకు చేరుకున్నాయని, అందులో మూడింటికి ఎన్ఎంసీ నుంచి అనుమతులు వచ్చాయన్నారు. మిగతా రెండు కళాశాలలకు త్వరలోనే అనుమతులు లభిస్తాయన్నారు. నంద్యాల సర్వజన ఆసుపత్రిలో ప్రభుత్వం రూ.5కోట్లతో ఓపీ భవన నిర్మాణం పూర్తి చేయడంతో పాటు అధునాతన ఆపరేషన్ థియేటర్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. రోగులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం వైద్యులను నియమించిందన్నారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో చిన్నారుల కోసం ఎస్ఎన్‌సీయూ విభాగంలో అధునాతన యంత్రాలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. సకాలంలో రక్త పరీక్షలు, స్కానింగ్ చేసేందుకు యంత్రాలను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. గత పాలకుల హయాంలో అభివృద్ధికి నోచుకోని ఆసుపత్రుల్లో తమ ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తుందని వివరించారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఏపీ ఎంఐడీసీ ఎండీ మురళీ, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, సూపరింటెండెంట్ స్వర్ణలత, జీజీహెచ్ సూపరిండెంటెంట్ ప్రసాదరావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ జఫరుల్లా పాల్గొన్నారు.



శిశువును లాలిస్తూ..

నంద్యాల సర్వజన ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలిస్తున్న క్రమంలో మంత్రి విడదల రజిని ఎస్ఎన్‌సీయూ విభాగంలోకి వెళ్లారు. అక్కడ తీవ్ర అనారోగ్యంతో ఓ నవజాత శిశువుకు వైద్యులు మెరుగైన వైద్యం అందించే క్రమంలో ఏడుస్తున్న దృశ్యం చూసి మంత్రి చలించారు. వెంటనే ఆ శిశువును ఎత్తుకొని తల్లి ప్రేమను పంచారు. బిడ్డను ముద్దు చేస్తూ.. నవ్వించడం చూసి అందరి ముఖాల్లో చిరునవ్వు కనిపించింది.

అభివృద్ధిని అడ్డుకోవడం విడ్డూరం – మంత్రి బుగ్గన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేక కోర్టుకు వెళ్లి మరీ అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని మంత్రి బుగ్గన అన్నారు. కొందరు నాయకులు డోన్ నియోజకవర్గంలో పర్యటిస్తూ అవగాహన లేకుండా విమర్శిస్తున్నారన్నారు. కనీస పరిజ్ఞానం లేకుండా అధికార పార్టీ నేతలపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. నంద్యాలలో మెడికల్ కళాశాల ప్రారంభమైతే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇక కర్నూలుకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు.

ఆరు నెలల క్రితమే పూర్తయ్యేది – ఎమ్మెల్యే శిల్పా

నంద్యాల మెడికల్ కళాశాల నిర్మాణం ఆరు నెలల క్రితమే పూర్తి కావాల్సి ఉండేదని, కొన్ని దుష్టశక్తులు రైతుల పేరుతో కోర్టుకెళ్లి అడ్డుపడ్డాయని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి విమర్శించారు. అయినప్పటికీ ప్రజల అవసరం కోసం ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మించడం మంచిదేనని కోర్టు తీర్పును ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్ష నాయకులు అభివృద్ధికి అడ్డుపడటం మానుకోవాలని సూచించారు. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వానికి సహకరించాలని హితవు పలికారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి చొరవతోనే నంద్యాల మెడికల్ కళాశాల ఏర్పాటైందన్నారు.

కోర్నపల్లె సమీపంలో బయటపడిన గుహ

- గుండం ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో గుర్తించిన భక్తులు

కొలిమిగుండ్ల: అంతర్జాతీయ ఖ్యాతి పొందిన బెలుం గుహలు ఉన్న మండలంలోనే మరో గుహ బయటపడింది. కోర్నపల్లె గ్రామానికి మూడున్నర కిలో మీటర్ల దూరంలో ప్రకృతి రమణీయత మధ్య పురాతన గుండం ఆంజనేయస్వామి ఆలయం ఉంది. ఇక్కడ స్వామి విగ్రహాన్ని వ్యాస మహర్షి ప్రతిష్ఠించినట్లు ప్రతీతి. ఈ ఆలయానికి పైభాగాన కొండపై సుమారు కిలోమీటరు దూరంలో వందల ఏళ్ల నాటి గుహ వెలుగు చూసింది. కొన్నేళ్ల క్రితం కోర్నపల్లె, అబ్దులాపురం గ్రామస్తులు గుర్తించినా పట్టించుకోలేదు. రెండు రోజుల నుంచి గ్రామస్తులతో పాటు భక్తులు గుహ ముఖ ద్వారం వద్ద నున్న పెద్ద బండరాళ్లు తొలగిస్తున్నారు. లోపల కొంత దూరం వెళ్లాక చాలా విశాలంగా ఉందని స్థానికులు తెలిపారు. సుమారు అర కిలోమీటర్ దూరం వరకు టార్చిలైట్ల సాయంతో లోపలకు వెళ్లొచ్చామని, గుహ లోపల పెద్ద సంఖ్యలో గబ్బిలాలు ఉన్నాయని వెల్లడించారు. వర్షం కురిస్తే కొండల పైభాగం నుంచి జలధార ప్రవహిస్తూ ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది.



గుహలో మట్టిని తొలగిస్తున్న ప్రజలు

పీఎఫ్‌ఎంఎస్ ఖాతాలను సరి చూసుకోండి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా జమ అయ్యేందుకు వీలుగా గత ఏడాది యూనియన్ బ్యాంకుల్లో ప్రారంభించిన పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(పీఎఫ్ఎంఎస్) ఖాతాలను సరి చూసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో పీఎఫ్ఎంఎస్ సిస్టమ్ ద్వారా నిధులను జమ చేస్తామని చెప్పినా, పలు కారణాల వల్ల పాత పద్ధతిలో సీఎఫ్ఎంఎస్ అమలైందన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులు పీఎఫ్ఎంఎస్ ద్వారా నేరుగా ఆయా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ కానున్నాట్లు పీఆర్అండ్ఆర్‌డీ ఉన్నతాధికారులు తెలిపారన్నారు. ఇదే విషయాన్ని ఇటీవల జరిగిన డీఆర్‌సీ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కూడా చెప్పారన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా ఖాతాలను సంబంధిత సర్పంచులు పరిశీలించుకోవాలని, ఒకవేళ ఖాతాలు యాక్టివేషన్‌లో లేకుంటే ఫారం 60లో వివరాలను నమోదు చేసి బ్యాంకులో అందజేయాలన్నారు. ఇంకా డిజిటల్ కీ తీసుకోని గ్రామ పంచాయతీలు వెంటనే ఎన్ఐసీ అధికారులను సంప్రదించాలన్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (జీపీడీపీ) ఈ నెల 5 నాటికి అప్‌లోడ్ చేయకపోతే ఈఓఆర్‌డీలపై చర్యలు తప్పవన్నారు.

శునక రాజసం!



వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నా, వాతావరణం చల్లబడినా.. ఇప్పటికీ ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఒకరోజు వర్షం కురవడం, మరుసటి రోజు ఎండ ధాటికి ప్రజలు చెమటలు కక్కుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఓ శునకం ఏటీఎం కేంద్రాన్ని సేద తీరేందుకు అనువైన ప్రాంతంగా ఎంచుకుంది. నగరంలోని సెంట్రల్ ప్లాజాలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం తలుపును ఎవరైనా తెరవగానే లోనికి వెళ్లి ఎంచక్కా ఇక్కడి ఏసీలో కునుకు తీస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

జల్సాలకు అలవాటుపడి చోరీలు

- తొమ్మిది మంది దొంగల అరెస్టు
- రూ.4 లక్షల నగదు స్వాధీనం



దొంగలను అరెస్ట్ చూపుతున్న ఆదోని త్రీటౌన్ పోలీసులు

ఆదోని టౌన్: జల్సాలకు అలవాటుపడి చోరీలు చేసే ముఠాను గురువారం ఆదోని త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.4 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. త్రీటౌన్ సీఐ శ్రీరామ్ తెలిపిన వివరాల మేరకు.. తమ జేబులోని డబ్బును కాజేశారని ఏప్రిల్ 19వ తేదీన నెరుడప్పల గ్రామానికి చెందిన పెద్దయ్య, వందవాగిలికి చెందిన హుసేని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు తొమ్మిది మంది అనుమానాస్పదంగా కనిపించారు. వారి అదుపులోకి తీసుకుని విచారించగా బొమ్మలు, వెంట్రుకలు, పండ్ల వ్యాపారం ముసుగులో తామే చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. రద్దీగా ఉండే ప్రాంతాలు, రాజకీయ నాయకుల సమావేశాలు జరిగిన ప్రాంతాల్లో పిక్‌పాకెటింగ్ చేస్తున్నట్లు చెప్పారు. వీరిని ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డులో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో అనంతపురం చంద్రబాబుకొట్టాలకు చెందిన పెద్దన్న, బుక్కరాయ సముద్రం గాంధీ నగర్‌కు చెందిన ఎరుకల చిన్నసుంకయ్య, అనంతపురం జిల్లాకు చెందిన మామిళ్ల వెంకటేష్, అనంతపురం సాయినగర్‌కు చెందిన ఎరుకల శ్రీనివాసులు, సత్యసాయి జిల్లా మారాల గ్రామానికి చెందిన ఎరుకల నారాయణస్వామి, అనంతపురం పట్టణానికి చెందిన ఎస్.వెంకటరాముడు, అనంతపురం బుద్ధప్పనగర్‌కు చెందిన శెట్టిలింగమయ్య, పులివెందులకు చెందిన మావిళ్ల ఎరుకలప్ప, వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురానికి చెందిన మల్లికార్జున ఉన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల్లో ప్రతిభ



ఓవరాల్ రన్నరప్‌గా నిలిచిన కర్నూలు వెయిట్ లిఫ్టర్లు



పతకాలు సాధించిన కర్నూలు అథ్లెట్లు

కర్నూలు (టౌన్): తిరుపతిలో ఈనెల 1 నుంచి నిర్వహిస్తున్న ఏపీ సీఎం కప్ పోటీల్లో కర్నూలు జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో ఓవరాల్ రన్నరప్‌గా నిలిచారు. వెయిట్ లిఫ్టింగ్‌లో జి. తులసి (49 కేజీలు, కాంస్యం) యం.పుష్పాంజలి (71 కేజీలు, కాంస్యం) నాగమణి (87 కేజీలు, వెండి) డిసి. వీరేష్ (55 కేజీలు, బంగారం) షాలీ అబ్దుల్లా (61 కేజీలు, బంగారం) బి. వీరేష్ (61 కేజీలు, కాంస్యం) కే. వీరేష్ (67 కేజీలు, వెండి) నరసింహ నాయక్ (96 కేజీలు, బంగారం) విజేతలుగా నిలిచారు. అలాగే అథ్లెటిక్స్‌లో సీ. దేవి (800 మీటర్ల పరుగు, బంగారం) రజియాబేగం (400 మీటర్లు, వెండి) మనీషా (లాంగ్‌జంప్, కాంస్యం) విజయం సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను స్టేడియం సీఈఓ రమణ, చీఫ్ కోచ్ నటరాజరావు అభినందించారు.

నేడు ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుపై సమావేశం

- కర్నూలు చేరుకున్న ఏపీఎఫ్‌పీఎస్ సెక్రటరీ



ఏపీఎఫ్‌పీఎస్ సెక్రటరీ చిరంజీవి చౌదరికి స్వాగతం పలుకుతున్న జిల్లా అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుపై శుక్రవారం కర్నూలులోని ఉద్యాన భవన్‌లో పొదుపు మహిళలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారని జిల్లా ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. సమావేశం నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్) సెక్రటరీ, మార్కెటింగ్, సహకార శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి గురువారం రాత్రి కర్నూలు చేరుకున్నారు. ఈయనకు మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి, జిల్లా సహకార శాఖ అధికారి రామాంజనేయులు స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం కల్లూరు మండలం తడకనపల్లెలో పొదుపు మహిళలు నిర్వహిస్తున్న వెజిటబుల్ సోలార్ డ్రయర్స్ పనితీరును పరిశీలించి.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సమావేశం నిర్వహించనున్నారు.

డ్యాన్స్ చేస్తూ కుప్పకూలి..



మృతిచెందిన పుల్లయ్య

ఆళ్లగడ్డ: ఓ పెళ్లి బృందం ఊరేగింపులో డ్యాన్స్ చేస్తూ ఓ వ్యక్తి ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం ఆళ్లగడ్డ పట్టణంలోని కర్ణమయ్య వీధిలో చోటుచేసుకుంది. బంధువుల వివాహంలో మేళతాళాల మధ్య డ్యాన్స్ చేస్తున్న పుల్లయ్య(28) గుండె పోటు రావడంతో కిందపడ్డాడు. వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య పుల్లమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కమనీయం..
పాండురంగడి కల్యాణం



శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగస్వామి పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు స్వామివారి కల్యాణ మహోత్సవానికి ముందు ధ్వజపట ఆరాధన, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు జరిపారు. అనంతరం చిత్తానక్షత్రమున స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టగా భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పాటి ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు, పూజా సామగ్రిని సమర్పించారు. రాత్రి పాండురంగడు హనుమద్వాహనంపై భక్తులకు కనువిందు చేశారు. శుక్రవారం సింహ వాహన సేవ నిర్వహించనున్నారు.

సచివాలయాల్లో వందశాతం బయోమెట్రిక్ ఉండాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు వందశాతం బయోమెట్రిక్ హాజరు ఉండేలా ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల పనితీరు మెరుగుపై మండలాల ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది బయోమెట్రిక్ హాజరు వంద శాతం ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్ టైంతో సమానంగా సిబ్బంది హాజరు ఔట్ టైమ్ లో కూడా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే స్పందన కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది అందరూ హాజరు కావాలన్నారు. ఏపీ సేవా సర్వీసులలో పెండింగులో ఉన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే క్లియర్ చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ సర్వే, సుస్థిర అభివృద్ధి లక్ష్యా సర్వేను వేగవంతం చేయాలన్నారు. స్పందన ద్వారా స్వీకరించిన దరఖాస్తులను 24 గంటల లోపల ఓపెన్ చేసి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులు కూడా వెంటనే ప్రారంభించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఎల్‌డీఓ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ మెకానిక్‌పై హత్యాయత్నం

కర్నూలు: అబ్బాస్ నగర్‌లోని గుజిరీ దుకాణం పక్కన మోటార్‌బైక్ మెకానిక్ దుకాణంలో ఉన్న నన్నూరు గ్రామానికి చెందిన వీరశేఖరప్పపై సమీప బంధువులు కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. వీరశేఖరప్ప చిన్నాన్న ఉమామహేశ్వరప్ప, ఆయన కుమారుడు రామేశ్వరప్పలు కలసి ఈ దాడికి పాల్పడ్డారు. వీరిరువురి మధ్య కొన్నేళ్లుగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఇరవై ఏళ్ల క్రితం స్వగ్రామం నన్నూరు వదిలి వీరశేఖరప్ప శరీన్‌నగర్‌లో ఉంటూ మెకానిక్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అలాగే ఆయన చిన్నాన్న ఉమామహేశ్వరప్ప, కుమారుడు రామేశ్వరప్పలు సమీప కాలనీలోనే నివాసముంటున్నారు. ఆస్తి తగాదాలను దృష్టిలో పెట్టుకుని గురువారం తనపై హత్యాయత్నానికి పాల్పడినట్లు వీరశేఖరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాల్గవ పట్టణ ఎస్ఐ పెద్దయ్య నాయుడు తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- సమస్యలపై 7382614308కు ఫిర్యాదు చేయండి

కర్నూలు(రాజ్‌విహార్): గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో ఏర్పడే విద్యుత్ అంతరాయం నివారణ కోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి పేర్కొన్నారు. బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్, విద్యుత్ స్తంభాలు పడిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, ఇతర విద్యుత్ సమస్యలు తలెత్తితే వినియోగదారులు కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 7382614308కు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో విద్యుత్ శాఖకు రూ.1.5 కోట్ల నష్టం వాటిల్లిందని వెల్లడించారు. బుధవారం రాత్రి వర్షం, పిడుగుపాటుకు గూళ్యం గ్రామంలోని సబ్ స్టేషన్‌లో ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, అలాగే కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 9.1 మీటర్ల పొడవైన స్తంభాలు 32, 8 మీటర్ల స్తంభాలు 341 పడిపోగా, 53 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినట్లు వెల్లడించారు. వీలైనంత త్వరగా కరెంటును పునరుద్ధరిస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు. ప్రస్తుతం గ్రామాల్లో ఎక్కడా అంతరాయం లేకుండా సరఫరా అందిస్తున్నామన్నారు.

భూముల పరిశీలన



బలపనూరు గ్రామం వద్ద భూమిని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

పాణ్యం: నంద్యాల జిల్లా ఏర్పాటుతో పోలీసు శాఖకు అవసరమైన భూములు కేటాయించేందుకు గురువారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎస్పీ రఘువీర్‌రెడ్డి గురువారం భూములను పరిశీలించారు. పాణ్యం మండలం సుగాలిమెట్ట, బలపనూరు వద్ద ఉన్న వక్ఫ్‌బోర్డు భూములను పరిశీలించారు. పోలీసు కార్యాలయాలు, బెటాలియన్ తదితర ఏర్పాటు కోసం పోలీసు శాఖ నుంచి 20 ఎకరాల అవసరమని రెవెన్యూ శాఖకు ప్రతిపాదించినట్లు తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. వారి వెంట సర్వేయర్ నాగప్రసాద్, వీఆర్ఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

108లో గర్భిణి ప్రసవం



శిశువును చూపుతున్న 108 సిబ్బంది

గడివేముల: పురిటినొప్పులు వచ్చిన ఓ గర్భిణిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రసవించింది. గని గ్రామానికి చెందిన హేమకు బుధవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108కి ఫోన్ చేశారు. 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి సకాలంలో చేరుకున్న 108 సిబ్బంది గర్భిణిని ఓర్వకల్లు సీహెచ్‌సీకి తరలిస్తుండగా హుసేనాపురం సమీపంలో మగ బిడ్డను ప్రసవించింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బంది రమేష్, చెన్నయ్యకు గర్భిణి కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు (క్వింటల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	3,519	6,731
పొద్దుతిరుగుడు	4,409	4,429
ఆముదం	4,889	5,359
వాము	3,330	24,800
ఎండు మిర్చి	3,599	16,099
శనగలు	2,209	4,560
కందులు	1,508	8,019
మొక్కజొన్న	1,625	1,805
మినుములు	6,889	7,458

క్లుప్తంగా

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

శిరివెళ్ల: కోటపాడు గ్రామ సచివాలయంలో గురువారం నంద్యాల ఉదయానంద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్యులు సౌమ్యారెడ్డి 65 మందికి పరీక్షలు చేసి 21 మందికి ఆపరేషన్లు అవసరమని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని డాక్టర్ తెలిపారు. సర్పంచు దూదేకుల ఉశేనిబీ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నేడు ఉరుసు

ఉయ్యాలవాడ : మండలంలోని పుచ్చకాయల పల్లె గ్రామ పంచాయతీ మజారా గ్రామం బాబానగర్ దర్గాలో శ్రీ హజరత్ అబ్దుల్లా గఫార్‌సా ఖాద్రి ఉరుసు మహోత్సవం శుక్రవారం ప్రారంభమవుతుందని నిర్వహకులు పేర్కొన్నారు. గురువారం నిర్వహకుడు దస్తగిరి గఫార్ మాట్లాడుతూ ఈ దర్గా ప్రతిష్టించినప్పటి నుంచి ఏటా మే నెల వైశాఖ శుద్ధ పౌర్ణమి నాడు(శుక్రవారం రాత్రి) గంధం, మరుసటి రోజు ఉరుసు మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ పేర్కొన్నారు. దర్గాకు వచ్చే భక్తుల కోసం అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు స్పష్టం చేశారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

ఉయ్యాలవాడ: జగనన్న కాలనీలలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఇన్‌చార్జ్ హౌసింగ్ డీఈ నాగరాజు సూచించారు.గురువారం స్థానిక హౌసింగ్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. గోవిందపల్లె గ్రామంలో ఇంటి నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు హౌసింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలిసి అవగాహన కల్పించారు. మండలంలో 992 గృహాలు మంజూరు కాగా, ఇప్పటివరకు 338 గృహాల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాల్లో బిల్లులను జమ చేసినట్లు తెలిపారు. 539 గృహాలు వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. 11 గ్రామ సచివాలయాల పరిధిలో 115 మంది లబ్ధిదారులు గృహ అనుమతి పొంది కూడా ఇంత వరకు నిర్మాణాలు చేపట్టలేదన్నారు. ఈ జాబితాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిర్మాణాలు చేపట్టకపోతే స్థలాలు రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీఈ స్పష్టం చేశారు. వర్క్ఇన్‌స్పెక్టర్ షాదిక్‌బాషా, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుభాషిణి వెంట ఉన్నారు.

వేలంపాటలో పెరిగిన ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

ఆళ్లగడ్డ: ఆంజనేయ, ఈశ్వర, బైరవ స్వాముల మాన్యం భూముల వేలం పాట ద్వారా ఆదాయం పెరిగినట్లు ఈఓ సాయిజయచంద్రారెడ్డి తెలిపారు. చాగలమర్రి మండలం చింతల చెరువు గ్రామంలోని ఆంజనేయ స్వామి మాన్యం భూముల వేలం పాట గురువారం దేవాలయం ప్రాంగణంలో నిర్వహించారు. 9.90 ఎకరాల మాన్యం భూమిని ఏడాది పాటు కౌలుకు ఇచ్చేందుకు నిర్వహించిన వేలంపాటలో రూ 1.24 లక్షలకు పాటదారులు దక్కించుకున్నారు. అలాగే ఈశ్వర స్వామి దేవాలయానికి చెందిన 12.75 ఎకరాలను రూ.64 వేలకు, భైరవ స్వామి ఆలయానికి చెందిన 4.95 ఎకరాలను రూ.14.5 వేలకు పాడి కౌలు హక్కులను దక్కించుకున్నారు. ఆత్మకూరు ఈఓ కార్తిక్, గ్రామ పెద్దలు నరసింహారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, వేణుగోపాల్ ఉన్నారు

బాధ్యతల స్వీకరణ

నంద్యాల(వ్యవసాయం): సాధారణ బదిలీలో భాగంగా గురువారం స్థానిక న్యాయస్థానంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా ఆదినారాయణ బాధ్యతలు స్వీకరించారు. బార్ అసోసియేషన్ నాయకులు ఆయనకు ఆహ్వానం పలికారు. జడ్జి మాట్లాడుతూ.. మార్కాపురం నుంచి నంద్యాలకు రావడం ఆనందంగా ఉందని, న్యాయస్థానంలో బార్‌కు, బెంచ్‌కు మధ్య సహాయ సహకారాలు ఉండాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రఘుప్రకాష్, ప్రతాపరెడ్డి, రాజేశ్వరి, తదితర సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మోచా తుపానుపై అప్రమత్తం

రుద్రవరం: ఈనెల 6నుంచి 9వ తేదీ వరకు మోచా తుపాను కారణంగా మండలంలో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి జ్యోతి సూచించారు. తుపాను వల్ల పంటలు దెబ్బతింటే వెంటనే వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లోని సిబ్బందికి తెలియజేయాలన్నారు. ప్రస్తుతం వరి పంట కోత దశలో ఉందని, అధిక వర్షాలు కురిస్తే ధాన్యం మొలకెత్తే అవకాశం ఉందన్నారు. మొలకలు రాకుండా 5 శాతం ఉప్పు ద్రావణంను పిచికారీ చేయాలన్నారు. సందేహాలుంటే అధికారులను సంప్రదించాలని సూచించారు.

చెరువులకు మహర్దశ

- మిషన్ అమృత్ సరోవర్‌లో భాగంగా ఆధునికీకరణ
- ఒక్కో చెరువు అభివృద్ధికి రూ.15 లక్షలకు పైగా కేటాయింపు
- జిల్లాలో 81 చెరువుల పనులు ప్రారంభం, 51 చోట్ల పనులు పూర్తి





బావిపల్లె గ్రామ చెరువులో అమృత్ సరోవర్ పనులు జరుగుతున్న దృశ్యం, నొస్సం గ్రామ చెరువులో రిపబ్లిక్ డే ఉత్సవాలు జరుపుతున్న దృశ్యం (ఫైల్)

నంద్యాల(రూరల్): జిల్లాలో మిషన్ అమృత్ సరోవర్ పథకం పనులు శరవేగంగా సాగుతున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 వసంతాలు పూర్తయిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నాయి. ఈ పథకం ద్వారా గ్రామాల్లో చెరువులను ఆధునీకరించడంతో పాటు అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా చెరువుల్లో పూర్తిస్థాయిలో నీటిని నింపి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడంతో పాటు వేసవిలో పశుపక్షాదులకు నీటి కష్టాలు లేకుండా చర్యలు చేపడుతున్నారు. మరోవైపు భూగర్భజలాలు పెంపునకు కృషి చేస్తున్నారు. తద్వారా పరిసరాల్లోని బోరుబావులు ఎండిపోకుండా వ్యవసాయానికి నీటి కొరత లేకుండా ఉంటుంది.

లక్ష్యం మేరకు పనులు

అమృత్ సరోవర్ ద్వారా జిల్లావ్యాప్తంగా 80 చెరువులను ఆధునీకరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే అధికారులు 159 చెరువులను గుర్తించారు. 2022 ఏప్రిల్ 24న పథకం ప్రారంభం కాగా ప్రస్తుతం 80 చెరువులకు గాను 50 చెరువులలో పనులు పూర్తయ్యాయని, మరో 20 చెరువులలో పనులు చేస్తుండగా 10 చెరువులలో నీరు నిల్వ ఉండటంతో పనులు ప్రారంభించలేదు. ఎకరం విస్తీర్ణంలో 4 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని (పూడిక తీసి) తీసి అందుకు అనుగుణంగా నీటిని నిలువ ఉంచనున్నారు. గతేడాది ఆగస్టు 15, ఈ ఏడాది జనవరి 26వ తేదీలలో అమృత్ సరోవర్ పథకం కింద పనులు పూర్తయిన చెరువుల వద్ద ఉపాధి అధికారులు, సిబ్బంది, కూలీలు, స్థానిక విద్యార్థులతో కలిసి జాతీయ జెండా వందన కార్యక్రమాలు నిర్వహించారు.

పనులు ఇలా....

చెరువుల్లో పూడిక తీయడం, చెరువుకు నీటిని అందించే ఫీడర్ ఛానల్‌ను ఆధునీకరించడం, ఆయకట్టుకు నీరందించే చెరువు తూములు, గేట్లు, ప్రధాన కాలువలకు మరమ్మతులతో పాటు చెరువుకట్టల ఆధునీకరణ పనులు చేయనున్నారు. కాలువకట్ట మరింత గట్టి పడేలా మొక్కలు నాటడం, వాకింగ్ ట్రాక్, తదితర సుందరీకరణ పనులు చేయనున్నారు. రివిట్‌మెంట్ పనులు పూర్తి స్థాయిలో చేపట్టనున్నారు.

జిల్లాలో అమృత్ సరోవర్ పథకం వివరాలు

క్లస్టర్	మంజూరైన చెరువులు	పనులు పూర్తయినవి	పూర్తికానివి
ఆత్మకూరు	14	12	2
డోన్	25	17	8
నంద్యాల	13	9	4
కోవెలకుంట్ల	29	13	16

శరవేగంగా పనులు

జిల్లాలో ఏడాదిలో 81 చెరువుల్లో పనులు పూర్తి చేయడం లక్ష్యం కాగా ఇప్పటికే 51 చెరువుల్లో పనులు పూర్తి చేశారు. జూన్ చివరి వారంలోగా మిగతా చెరువుల పనులు పూర్తి చేసి, ఆగస్టు 15వ తేదీన పనులు పూర్తయిన అన్ని చెరువుల వద్ద జాతీయ జెండాలు ఎగురవేసి జాతికి అంకితం చేస్తారు. ప్రస్తుతం మిగిలిన 30 చెరువుల ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అ దిశగా పనులు సాగుతున్నాయి. ఈ పనులను డ్వామా విభాగం పనులు పర్యవేక్షిస్తోంది. అమృత్ సరోవర్ కింద ప్రభుత్వం ఒక్కో చెరువుకు రూ.15 లక్షల వరకు ఖర్చు చేస్తోంది. కొన్ని చెరువులకు రూ.12 లక్షలకు పైగా, మరికొన్ని చెరువులకు రూ.17 లక్షలకు పైగా వెచ్చిస్తున్నారు. పనులు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టారు. ఆధునీకరణ పనుల కోసం ప్రభుత్వం రూ.2 లక్షలు అదనంగా చెల్లిస్తుంది. దీంతో పాటు మా ఊరు-మా చెరువు కింద దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేస్తే అటువంటి వారి పేరు పెట్టనున్నారు.

రైతులకు వరం అమృత్ సరోవర్



అమృత్ సరోవర్ పథకం కింద గ్రామ సమీపంలోని చెరువు నుంచి తీసిన మట్టిని నాకున్న మూడెకరాల రాళ్ల పొలంలో గతేడాది వేయించాను. అనంతరం పొలంలో మిరప పంట వేయడంతో ఖర్చులన్నీ పోనూ రూ.2 లక్షల ఆదాయం వచ్చింది. బీడు భూమిని ఉపాధి హామీ అధికారుల సహకారంతో అమృత్ సరోవర్ ద్వారా పంట పొలంగా మార్చినందుకు చాలా సంతోషంగా ఉంది.

– గురప్ప, నొస్సం గ్రామస్తుడు

ప్రకృతి వనాలుగా మార్చడమే లక్ష్యం



అమృత్ సరోవర్ ద్వారా జిల్లాలో చెరువులను ప్రభుత్వం ఆధునీకరిస్తోంది. దీంతో చివరి ఆయకట్టుకు నీరందుతుంది. భూగర్భ జలాలు పెరిగి బోరు బావులకు నీరందుతుంది. వేసవిలో పశుపక్షాదారులకు సైతం నీటి సౌకర్యం కలుగుతుంది. జిల్లాలో ఆగస్టు 15 నాటికి 81 చెరువులను పూర్తి చేయాలన్నదే లక్ష్యం. ఇప్పటికి 51 చెరువుల్లో పనులు పూర్తయ్యాయి. మిగతా చోట్ల పనులు జరుగుతున్నాయి.

– రామచంద్రారెడ్డి, డ్వామా పీడీ, నంద్యాల జిల్లా

ప్రత్యేక పూజలు

రుద్రవరం: మండలకేంద్రం శివారులో వెలసిన గుట్టకొండ లక్ష్మీనరసింహ స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసింహ స్వామి జయంతి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

12 నుంచి శ్రీలక్ష్మీ మహాయాగం

నంద్యాల(అర్బన్): విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 12 నుండి 17వ తేదీ వరకు చండీ, రుద్ర, రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయాగం నిర్వహించనున్నట్లు జిల్లా దేవదాయ శాఖ అధికారి సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్న సంకల్పంతో యాగాన్ని తలపెట్టారని, దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ పర్యవేక్షణలో ఆగమ పండితులచే యాగం నిర్వహించనున్నారన్నారు. ప్రతి రోజు ఉదయం హోమాలు, సాయంత్రం రోజుకు ఒక దేవతామూర్తుల కల్యాణ మహోత్సవంతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక పరంపర కొనసాగుతుందని నంద్యాల జిల్లా భక్తులు, ప్రజలందరూ పాల్గొని పునీతులు కావాలని కోరారు.

నేడు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం

నంద్యాల(వ్యవసాయం): ప్రయాణికుల సౌకర్యార్థం నంద్యాల డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ గంగాధర్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు, వారి సమస్యలను పరిష్కరించేందుకు శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలను డిపో మేనేజర్ సెల్ 99592 25800 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.





చెన్నకేశవస్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు

చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం

శిరివెళ్ల: కోటపాడు చెన్న కేశవస్వామి, వీరభద్రస్వామి ఆలయంలో గురువారం శ్రీదేవి, భూదేవి సహిత చెన్న కేశవ స్వామివారి కల్యాణం ఘనంగా జరిగింది. తిరుపతికి చెందిన వేద పండితులు ఉదయం స్వామి వారికి అభిషేకం చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకుడు వంకదార సుబ్బ సత్యనారాయణశ్రేష్టి, చైర్మన్ వంకదార నరేంద్రబాబు దంపతులు ఉభయదారులుగా స్వామి వారి కల్యాణం జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ జరిగింది. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఈఓ వేణునాథరెడ్డి, చైర్మన్ గురిజాల గోపాల రెడ్డి పాల్గొన్నారు.

నంద్యాల(వ్యవసాయం):పట్టణంలోని తెలుగు పేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గురువారం నరసింహ జయంతిని పురస్కరించుకొని శ్రీదేవి భూదేవి సమేత శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలచే అలంకరించారు. స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణ వస్త్రాలు ధరింపజేసి శాస్త్రోక్తంగా వేదమంత్రాల సాక్షిగా స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి వ్యాఖ్యాతలుగా తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవ వ్యాఖ్యాత డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు, రామ్మోహన్‌శర్మ వ్యవహరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



రామచంద్రాపురంలో నిర్మించిన ఓంకారేశ్వర్వస్వామి ఆలయం

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఓంకారేశ్వర్వ స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ, గ్రామస్తులు గురువారం తెలిపారు. 5న గంగా నయనం, గోపూజ, గణపతి పూజ, స్వస్తి, పుణ్యాహవాచకం, నాందీ, మాతృకాపూజనం తో పాటు గ్రామోత్సవం, చెక్కభజన వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే శ్రీజ్ఞాన ప్రసాద గురూజీ దివ్యసందేశం, బ్రహ్మశ్రీ డాక్టర్ దివి హయగ్రీవాచార్యులుచే ప్రతి రోజు ప్రవచనాలు ఉంటాయన్నారు. 6న ప్రాతకాలపూజ, మహాస్నపనం, జగద్గురు శంకరాచార్య శ్రీ హంపి విరుపాక్ష పీఠాధీశ్వరులు విద్యారణ్య భారతిచే ధ్వజ ప్రతిష్ఠ, గణపతి నవగ్రహ, రుద్ర, చండీహోమాలు, ధాన్యాదివాసం ఉంటాయన్నారు. రాత్రి ప్రవచణాలలో పాటు భరతనాట్య ప్రదర్శన ఉంటుందన్నారు. 7న గర్తపూజ, యంత్రార్చన, శిఖరయంత్ర విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, బింబకళాన్యాసాధులు, కక్షాగ్ని, జ్వాలా దర్శనం, పూర్ణాహుతితో పాటు ఉదయం 9గంటలకు శివపార్వతుల కల్యాణం, మహా మంగళహారతి, వేదస్వస్తి ఉంటుందని వెల్లడించారు.

ఉత్తీర్ణత శాతం పెంపునకు చర్యలు



చాగలమర్రి కేజీబీవీలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ అనురాధ

ఆళ్లగడ్డ: ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడమే లక్ష్యంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా విద్యాశాఖాధికారిణి అనురాధ అన్నారు. ఆళ్లగడ్డ, శిరివెళ్ల, దొర్నిపాడు, ఉయ్యలవాడ, చాగలమర్రి, శిరివెళ్ల కేజీబీవీల్లో చదివి ఇంటర్మీడియెట్‌లో ఫెయిలైన విద్యార్థుల కోసం సబ్జెక్టుల వారిగా శిక్షణ అందించేందుకు చాగలమర్రి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఆ సందర్భంగా గురువారం కేంద్రాన్ని పరిశీలించిన డీఈఓ అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు ఫెయిల్ అయిన సబ్జెక్టులలో సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. పరీక్షలు పూర్తయ్యేవరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. జిల్లాలో 426 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారని వారికోసం చాగలమర్రి, వెలుగోడు, నంద్యాల, బనగానపల్లె,సంజామల, గడివేముల కేజీబీవీల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఎంఈఓ అనురాధ వెంట ఉన్నారు.

రీసర్వేలో అలసత్వం వీడాలి



ప్లానింగ్ సెక్రటరీలతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు

నంద్యాల(సిటీ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూహక్కు-భూరక్ష పథకం అమలులో అలసత్వం వీడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ అసెస్డ్ ఆస్తులను గుర్తించాలన్నారు. ఈ నెల 6వ తేదీలోగా అన్‌అసెస్డ్ ఆస్తులను అసెస్ చేయడంతో పాటు పట్టణంలోని ప్రతి అనువును రీసర్వే చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన 16ఏఏ ప్రకారం అర్బన్ ప్రాంతంలోని ప్రతి స్థలాన్ని డ్రోన్లు, ఇతర సర్వే పరికరాలు ఉపయోగించి రీసర్వే చేయాలని పలుమార్లు హెచ్చరించినా ఫలితం లేదన్నారు. నిర్ణీత గడువులోగా రీసర్వే పనులు పూర్తి చేసి రెవెన్యూ అధికారి వరప్రసాద్ ఆధ్వర్యంలో వాటిని అసెస్ చేయాలని, ఆదేవిధంగా అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో రీ సర్వే వెబ్‌సైట్‌లో ఆస్తుల వివరాలను పొందుపరచాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాల అమలు

- రాజకీయ సంప్రదాయాలకు స్వస్తి పలికిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి



వృద్ధురాలికి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

దొర్నిపాడు: వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఆయన గురువారం ఆరో రోజుగా దొర్నిపాడు-1, 2 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా ? అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయ సాంప్రదాయాన్ని మార్చి ప్రజలకు సేవ చేయడం, అర్హులదరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. గత టీడీపీ హయాంలో ఒక సంక్షేమ పథకం అందాలంటే జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదని, ప్రస్తుతం ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నారని గుర్తు చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అక్కడక్కడా ఎదురైన చిన్న చిన్న సమస్యలను అధికారులు, నాయకులతో మాట్లాడి పరిష్కరించారు. ఎంపీపీ అమర్‌నాథ్ రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, నాయకులు బత్తుల నాగేశ్వరరావు యాదవ్, భూమా చెంచిరెడ్డి, సర్పంచ్ దేవమణి, వైస్ ఎంపీపీ లక్ష్మిదేవి, శివారెడ్డి, ఎంపీడీఓ నాగ అనసూయ, తహసీల్దార్ జయప్రసాద్, పీఆర్ ఏఈ కొండారెడ్డి, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ సుప్రియ, మండల సర్వేయర్ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతి చెందిన చాకలి శ్రీనివాసులు

శిరివెళ్ల: యర్రగుంట్లకు చెందిన చాకలి శ్రీనివాసులు (58) చికిత్స పొందుతు గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వ్యక్తి మద్యానికి బానిసై అప్పులపాల య్యాడు. ఈ క్రమంలో బుధవారం పురుగుల మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. బంధువులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో ఉన్నత వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకలేక గురువారం మృతి చెందాడు. కులవృత్తి చేసుకుంటున్న వ్యక్తికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఆదిలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కోలుకోలేక యువకుడు..

రుద్రవరం: స్థానిక కుమ్మరివీధికి చెందిన మనోహర్ (18) అనే యువకుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఏఎస్‌ఐ రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 18న మనోహర్ మోటార్ సైకిల్‌పై శిరివెళ్ల వైపు వస్తుండగా మార్గమధ్యలో కొండ మాయపల్లె వద్ద మోటార్‌సైకిల్ అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

బీరుబాటిల్‌తో దాడి

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామానికి చెందిన కొర్ర పెద్దసుబ్బయ్యపై అదే గ్రామానికి చెందిన రామచంద్రుడు, నర్సిరెడ్డి అనే ఇద్దరు వ్యక్తులు ముఖంపై బీరుబాటిల్‌తో దాడి చేసినట్లు ఏఎస్‌ఐ రామకృష్ణారెడ్డి గురువారం తెలిపారు. ఇరువురి మధ్య పాతకక్షలు ఉన్నాయని, దీన్ని దృష్టిలో పెట్టుకోని పెద్దసుబ్బయ్య స్థానిక చౌడమ్మ దేవాలయం వద్ద కూర్చొని ఉండగా ఇద్దరు వ్యక్తులు మాట మాట పెరిగి ఘర్షణ పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ చెప్పారు.

గృహ నిర్మాణాలు చేపట్టండి

దొర్నిపాడు: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని గుండుపాపల సచివాలయంలో తహసీల్దార్ జయప్రసాద్ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. వెంటనే నిర్మాణాలు చేపట్టాలని, ప్రభుత్వం బిల్లులను ఎప్పటికప్పుడు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. ఎంపీడీఓ నాగఅనసూయ, సర్పంచ్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి




మంత్రి రజనీని సన్మానిస్తున్న ఐఎంఏ వైద్యులు

నంద్యాల(వ్యవసాయం): రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని నంద్యాల పర్యటనలో భాగంగా గురువారం ఐఎంఏ రాష్ట్ర శాఖ తరపున ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి సమక్షంలో వినతి పత్రం అందజేశారు. వినతి పత్రంలోని అంశాలను డాక్టర్ రవికృష్ణ మంత్రికి వివరిస్తూ.. ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ ఏక గవాక్ష విధానంలో ఏర్పాటు చేయాలని, 15 మీటర్లలోపు భవనాల ఆసుపత్రులకు అగ్నిమాపక నిరభ్యంతర పత్రం లేకుండా రిజిస్ట్రేషన్ చేయాలని, ఒక్క స్పెషాలిటీతో ఉన్న 20 పడకల ఆసుపత్రులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావాలని కోరామన్నారు. అనంతరం మంత్రి రజని మాట్లాడుతూ ఈ అంశాలన్నీ రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శితో చర్చించి అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. వైద్యులు మధుసూదనరావు, రాకేష్‌రెడ్డి, విజయభాస్కరరెడ్డి, జఫరుల్లా, చంద్రశేఖర్, ఫణిల్, అనిల్, నాగమణి, నర్మద, వసుధ, అరుణకుమారి తదితరులు ఉన్నారు.

నంద్యాల(అర్బన్): నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల సంఖ్య పెంచడంతో పాటు రోగులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు ధనుంజయుడు, నాగరాముడు కోరారు. ప్రభుత్వాసుపత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ గురువారం ఆసుపత్రి తనిఖీకి వచ్చిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినికి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ.. డాక్టర్లు, వైద్యుల కొరత ఉండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిన్నపాటి వైద్యం కోసం వచ్చే రోగులను కర్నూలు సర్వజన ఆసుపత్రికి రెఫర్ చేయడం సాధారమైపోయిందన్నారు. గర్భిణులకు సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారని, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌ల కొరత ఉందని చెప్పారు.

సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి చర్యలు



ప్రభుత్వ ఎస్సీ సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామచంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డ్వామా పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, కళాశాలల ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయా వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు చేపట్టాల్సిన పనులపై నిర్వాహకులతో చర్చించారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు అందించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.ఏపీఓ గణేష్ వెంట ఉన్నారు.

అధ్యాపకులకు సన్మానం

నంద్యాల(అర్బన్): ఇంటర్మీడియెట్‌లో జిల్లాలోనే అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించిన గోస్పాడు ప్రభుత్వ మోడల్ కళాశాల అధ్యాపకులను ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. ఆల్‌మేవా జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఇమ్రాన్‌పాషా, అబులైజ్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో వెలసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం 19వ వార్షికోత్సవం పురస్కరించుకొని గురువారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయమే మూల విరాట్‌కు విశ్వక్షేన పూజ, పుణ్యాహవచానం, నవకుంభారాధన, రక్షాబంధనం నిర్వహించి వేద అధ్యాయన పఠనం, అగ్నిప్రతిష్ఠ, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పూలంగిసేవ, సువర్ణ రత్న ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సామూహిక విష్ణుసహస్ర నామం నిర్వహించి పూర్ణాహుతి గావించారు. మధ్యాహ్నం 12.05 గంటలకు అబిజిత్ లగ్నం నందు శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఆదిశేష వాహనంపై స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీభగవత్ సేవా సమాజ్ సభ్యులు సూరయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.